అంబులెన్స్‌ల తనిఖీ


108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఆఫీసర్ శ్రీకాంత్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రిలోని మూడు అంబులెన్స్‌లను 108 రంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు 108 వాహనాలు, నియోనాటల్ అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులను సరైన సమయంలో ఆస్పత్రిలో చేర్చేలా చూడాలన్నారు. అలాగే పలు సూచనలు కూడా చేశారు. ఎప్పటికప్పుడు వాహనాలను కూడా అందుబాటులో ఉంచాలని ఈఎంటీలు జావిద్, రాంబాబు, కుమారస్వామి పైలెట్ ప్రణయ్, శివ, ఖలీల్‌కు సూచించారు.

హఫీజ్‌పేట్ ముదిరాజ్ మత్స్య సహకార సంఘం కమిటీ


నూతన కార్యవర్గ సభ్యులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ ముదిరాజ్ మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా పరమేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా మహేశ్ ముదిరాజ్, డైరెక్టర్లుగా విక్రమ్, కృష్ణ, జనార్దన్, రాములు, శ్రీనివాస్, రవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు, అదేవిధంగా ముదిరాజ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఎంపీటీసీ లావణ్య, గ్రామ పంచాయతీ ఈఓ లక్ష్మీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలోని అవసరమైన అన్ని రోడ్లను సీసీలుగా మార్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, కోటేశ్‌గౌడ్, ప్రవీన్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో మల్లికార్జున స్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


మాధవి

జిన్నారం: మహిళ అదృశ్యమైన ఘటన గుమ్మడిదలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదలకు చెందిన పుదరి నర్సింహులు భార్య మాధవి ఈ నెల 16న ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త నర్సింహులు సోమవారం గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన వివరాల మేరకు.. పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గీతం యూనివర్సిటీ సమీపంలో మూడు రోజుల క్రితం మూతపడిన హోటల్లో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా గుర్తుతెలియని యాచకుడిగా గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో మూడు రోజులు గడిచినా మృతుడి బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

ఏజీవర్సిటీ: విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశలోనే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఉద్యాన కళాశాల నిపుణుడు యూజీ అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ కే. కళాధర్ బాబు అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో వారం రోజుల పాటు ప్రత్యేక శిబిరాని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాధర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గ్రామంలో చేసే సేవా కార్యక్రమాలు సామాజిక చైతన్యం, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరం, క్షేత్రస్థాయి ప్రదర్శన, పంటలపై చీడపీడల యాజమాన్యంపై పలు కార్యక్రమాలు చేపడుతారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఇంటింటికీ తిరిగి గ్రామ సర్వే నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఎన్ఎస్ఎస్ పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాని ఏర్పాటు చేస్తునందుకు గ్రామస్తులు, గ్రామ ప్రత్యేకాధికారి కళాశాల యాజమాన్యానికి, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ ప్రత్యేకాధికారి సూర్యానారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జులు సంతోషిని, లావణ్య, వలంటీర్లు దుర్గాప్రసాద్, జనార్దన్, అక్షయ, అమిత్, అఖిల, ఆర్తి, నితిన్ పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దు

ఏజీవర్సిటీ: దేశంలోని 18 ఏళ్లు నిండివారందరికీ రాజ్యాంగం ఓటు అనే ఆయుధాన్ని ఇచ్చిందని ఈ ఓటు హక్కును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని కళాశాల డీన్ ప్రశాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఇంటెన్సి ఓటర్ అవేర్నెస్ అండ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని ఓటు అనే ఆయుధంతో మనకు నచ్చిన సరైన వ్యక్తిని పాలకునిగా ఎన్నుకునే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సంతోషిని, లావణ్య, వేణుగోపాల్, శ్రీనాథ్, తిరుపతయ్య, కృష్ణవేణి, మమత పాల్గొన్నారు.

సర్కార్ బడిలో సమస్యల తిష్ట..!

హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువు

- స్కూల్ ఆవరణలో అక్రమంగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కబ్జాదారుల చేతిలో ఆవరణ స్థలం
- పట్టించుకోని అధికారులు


తరగతి గదులకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్

హఫీజ్‌పేట్: ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. దీనితోడూ ఆవరణలో అక్రమంగా వాహనాల పార్కింగ్ చేస్తుండడంతో విద్యార్థులకు తరగతులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పాఠశాల ఖాళీ స్థలం కబ్జాదారుల చేతిలోకి వెళ్లింది. ముఖ్యంగా పాఠశాల ఆవరణలో జీహెచ్ఎంసీ వారు మధ్యాహ్న భోజన వంట గది, మరుగుదొడ్లను నిర్మించారు. కానీ వాటి నిర్వహణను పట్టించుకునే వారే కరువయ్యారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 172 మంది విద్యార్థులు, ఏడుగురు ఉపాధ్యాయులు, హెచ్ఎం ఉన్నారు. సమస్యలు పరిష్కరించాలని పలు మార్లు ఎంఈవో, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ పాఠశాల ఆవరణ స్థలంలో పార్కింగ్ చేస్తున్న వాహనాదారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలు..

- పాఠశాల చుట్టూ ప్రహరీ లేక భయాందోళనలో విద్యార్థులు
- బడి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, ఇష్టానుసారంగా కబ్జాదారులు మట్టిని పోస్తున్నారు.
- విద్యార్థులు ఆడుకునే ఖాళీ స్థలంలో భారీ వాహనాలు నిలుపుతున్నారు.
- విద్యార్థులకు ఆటల పోటీలు లేక తరగతి గదుల్లోనే ఉండాల్సి వస్తుంది.
- జీహెచ్ఎంసీ మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ నిర్వహణ లోపం కనిపిస్తుంది.
- కొంత మంది తప్పుడు పత్రాలతో ప్రభుత్వ పాఠశాల ఎదుట ఖాళీ స్థలం తమదంటూ ఆక్రమిస్తున్నారు.
- పాఠశాలలో ఉన్న వస్తువుల భద్రత కోసం పాఠశాల చుట్టూ గ్రిల్స్‌ను ఏర్పాటు చేయడం వలన విద్యార్థులు తరగతి గదుల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.


ఓల్డ్ హఫీజ్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్రమంగా నిలిపిన భారీ వాహనాలు

పరిష్కరించాల్సిన సమస్యలు ..

- పాఠశాల ఆవరణలో భారీ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి.
- స్కూల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.
- పాఠశాల భవనం గోడలకు మరమ్మతులు చేసి రంగులు వేయాలి.
- మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి విద్యార్థులకు చేయూతనందించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రహరీ లేక ఇబ్బందులు..



పాఠశాల చుట్టూ ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు స్కూల్ భవనం కొత్తది నిర్మించాలి. విద్యార్థుల భద్రత కోసం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఖాళీ సమయంలో బయటకు రావాలంటే అవస్థలు తప్పడం లేదు.
– జీవన్, సాయినగర్

వాహనాల పార్కింగ్‌ను అడ్డుకోవాలి..



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు మట్టి కుప్పలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు స్కూల్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించి పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించాలి.
– మనోజ్, హఫీజ్‌పేట్


తాత్కలికంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు


చెత్త డబ్బాల్లో పేరుకుపోయిన చెత్త


ఆవరణలో అక్రమంగా పోసిన మట్టికుప్పలు

విజేత సూపర్ మార్కెట్‌కు బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు


సందీప్ చౌదరికి బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రులు

కూకట్‌పల్లి: విజేత సూపర్ మార్కెట్స్ కంపెనీ ఈడీ మురకొండ సందీప్ చౌదరికి బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు వచ్చింది. సోమవారం జరిగిన హెచ్ఎంటీవీ–2023 బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రులు కోమటివెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఆయనను అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా సందీప్ చౌదరి మాట్లాడుతూ.. తన తండ్రి జగన్‌మోహన్‌రావు అడుగుజాడల్లో నడుచుకుంటున్నామని అన్నారు. 1999 చందానగర్‌లో తొలిసారిగా విజేత సూపర్ మార్కెట్‌ను నెలకొల్పామన్నారు. నేటికి 25 సంవత్సరాల విజయోత్సవంలో 109 శాఖలు ఏర్పాటు చేశామన్నారు. కస్టమర్లే దేవుళ్లు అనే సూక్తిని నిత్యం జపిస్తూ 1999లో సూపర్ మార్కెట్ వ్యాపారంలోకి ఒక అడుగు వేశామన్నారు. తమ కష్టాన్ని నిజం చేస్తూ నేడు 109 బ్రాంచీలతో విజేత సూపర్ మార్కెట్ ఒక బ్రాండుగా నిలిచి రజతోత్సవాలు జరుపుకుంటుందన్నారు. మమ్మల్ని నమ్మిన కస్టమర్ దేవుళ్లకు, ఖాతాదారులకు, డిస్ట్రిబ్యూటర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కుటుంబ సభ్యులు, ఉద్యోగ సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వారి కృషి పనిపట్ల నిబద్ధతే విజేత విజయానికి మూల కారణమన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ డీబీ రామాచారికి అరుదైన అవకాశం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీబీ రామాచారి కి అరుదైన గౌరవం దక్కింది. టెట్రాహెడ్రాన్ అండ్ టెట్రాహెడ్రాన్ లెటర్స్ ఎడిటోరియల్ బోర్డులో చేరేందుకు అవకాశం కల్పించారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలోని క్యాటలిసిస్ లేబోరేటరీలో ప్రొఫెసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఆర్గానిక్ కెమిస్ట్రీ జర్నల్స్ అనేవి ఆర్గానిక్ కెమిస్ట్రీ రంగంలో విభాగాలు, ప్రపంచవ్యాప్తంగా పూర్తి అసలైన పరిశోధనా పత్రాలను వేగంగా ప్రచురించడానికి అంతర్జాతీయ జర్నల్‌లుగా 1959 నుంచి గుర్తింపు పొందాయి. కాగా ప్రొఫెసర్ రామాచారి 115 కంటే ఎక్కువ ప్రచురణలను కలిగి ఉండడం విశేషం. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బెంగళూరులోని ఫెలో వంటి ఇతర అవార్డులు, గుర్తింపు కూడా పొందారు.ఆయన అనేక అవార్డులతో పాటు 2014లో హెచ్‌సీయూ చాన్స్‌లర్స్ అవార్డును కూడా సాధించారు. 22 మంది పీహెచ్‌డీలకు మార్గనిర్దేశం చేయడం విశేషం. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

మహిళాశక్తి అవార్డుల ప్రదానం


నిర్వాహకులతో మహిళా శక్తి అవార్డులు పొందిన వారు

రాయదుర్గం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న ప్రఖ్యాత సంస్థ ఉమెనార్జీ తెలంగాణ మహిళా అవార్డుల వేడుకను గచ్చిబౌలిలోని నిథమ్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇందులో భాగంగా విమెనర్జీ, వీఏయిమ్, ఇతర ప్రధాన 30 సంస్థలతో కలిసి యునైటెడ్ తెలంగాణ లోకల్ ఉమెన్స్ అసోసియేషన్ ఫ్రంట్(యూటీఎల్‌డబ్ల్యూఏఎఫ్)ను ఏర్పాటు చేశారు. అనంతరం నూతన సంస్థ లోగోను కూడా ఆవిష్కరించారు. అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, కాంటినెంటల్ ఆస్పత్రి వైస్‌చైర్మన్, డయాబెటిస్ ఫౌండేషన్ చైర్పర్సన్ అనురాధారెడ్డి, అగ్రి ఇండస్ట్రీయలిస్ట్ సుధారెడ్డితో కలిసి 300 మంది వివిధ రంగాలకు చెందిన మహిళలకు మహిళా శక్తి అవార్డులను ప్రదానం చేశారు.యూటీఎల్‌డబ్ల్యూఎఎఫ్ వ్యవస్థాపకురాలు దీప్తి రెడ్డి మాడుగుల మాట్లాడుతూ స్థానికేతర పెట్టుబడిదారులు స్థానిక వనరులను అన్యాయంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ మహిళలు వారి సొంత ఎంఎస్ఎంఈ అవకాశాలను ఎలా కోల్పోతున్నారో వివరించారు. స్థానిక జీవనోపాధికి ఉద్దేశించిన గ్రాంట్లు, నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం




పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈవో

శేరిలింగంపల్లి/మియాపూర్: శేరిలింగంపల్లి మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని 25 పరీక్షా కేంద్రాల్లో 5,660 మంది విద్యార్థులు ఎగ్జామ్ రాశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కేంద్రాలను పోలీసులు పర్యవేక్షించారు. శేరిలింగంపల్లిలోని ఆరు పరీక్షా కేంద్రాలను ఎంఈవో వెంకటయ్య తనిఖీ చేశారు. శేరిలింగంపల్లి జెడ్పీహెచ్ఎస్, నల్లగండ్లలోని అక్షయ ఫౌండేషన్ స్కూల్, తారానగర్‌లోని విద్యానికేతన్ స్కూల్, చందానగర్ ఎంఎస్ఆర్ స్కూల్, మియాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన ప్రారంభం




మాదాపూర్‌లో చిత్రప్రదర్శనను తిలకిస్తున్న కళాకారులు అంజుపోద్దార్, రమణారెడ్డి తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను రచయిత అంజుపొద్దార్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవి రమణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీత వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. 40 చిత్రాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సందర్శకులు వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

తుది శ్వాస విడిచి మరో ఇద్దరికి ఊపిరి

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జొమాటో డెలివరీ బాయ్
- బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించిన కాంటినెంటల్ వైద్యులు
- అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం
- మరొకరికి విజయవంతంగా లివర్ మార్పిడి చేసిన అదే హాస్పిటల్ వైద్య బృందం


బిశ్వాల్ ప్రభాస్

సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ జొమాటో డెలివరీ బాయ్ 'అవయవదానం'తో మరో ఇద్దరికి ఊపిరిపోశాడు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన (19) బిశ్వాల్ ప్రభాస్ స్థానిక కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. దీంతోపాటు జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన బిశ్వాల్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడగా హుటాహుటినా దగ్గర్లోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు బిశ్వాల్ బ్రెయిన్ డెడ్ అయ్యాడని నిర్ధారించారు. దీంతో డాక్టర్లు అవయవదానం గురించి ప్రభాస్ తల్లిదండ్రులకు వివరించగా వారు ఓ వైపు కొడుకు మరణించాడన్న బాధను దిగమింగుకొని పెద్దమనసుతో అంగీకరించారు. దీంతో డాక్టర్ సెంథిల్ కుమార్ వైద్య బృందం కాంటినెంటల్ హాస్పిటల్‌లోనే ప్రభాస్ నుంచి కాలేయాన్ని సేకరించి సోమవారం మరొకరికి విజయవంతంగా అమర్చారు. అవయవదానంతో ఇతరులకు పునఃజన్మనివ్వడం ఎంతో గొప్ప విషయమని కాంటినెంటల్ హాస్పిటల్స్ వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా బిశ్వాల్ ప్రభాస్‌కు హాస్పిటల్ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు.

నియామకం


జూలీ బేన్నాల

హఫీజ్‌పేట్: చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ మైనార్టీ మోర్చా ఎన్నికల ఇన్‌చార్జిగా జూలీ బేన్నాల నియమితులయ్యారు. మియాపూర్ ఆల్విన్‌కాలనీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు అప్సర్ పాషా చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నానన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మైనార్టీలను ఐక్యం చేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా జోనల్ స్పోర్ట్స్ మీట్

రాజేంద్రనగర్: పిల్లలను నిత్యం గంట పాటైన ఆటలు ఆడించాలని భాష్యం స్కూల్ సీఈఓ చైతన్య అన్నారు. సోమవారం భాష్యం విద్యా సంస్థల జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో అత్తాపూర్ భాష్యం స్కూల్‌కు చెందిన 3, 4, 5వ తరగతుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. త్రో బాల్‌లో 3వ తరగతి విద్యార్థిని మొదటి బహుమతి గెలుచుకుంది. హర్డిల్ రిలే రేస్‌లో 5వ తరగతి విద్యార్థులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. అలాగే రన్నింగ్ రేసులో 3వ తరగతి విద్యార్థిని ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. భాష్యం స్కూల్స్ సీఈఓ చైతన్య, జేఈఓ అంకమ్మరావు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అలాగే ప్రిన్సిపాల్ అయూబ్ భాషా, వైస్ ప్రిన్సిపాల్ లౌక్య విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం


చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డంపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో ఆదివారం అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని బీజేపీ బలంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చి హామీలన్నీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు. బీజేపీ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కలుగుతుందన్నారు. అదే విధంగా చేవెళ్ల పార్లమెంటు బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని..ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృత్తంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నప్పటికీ.. రాష్ట్రంలో వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ రాజ్, వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, బొక్క వేణుగోపాల్, అంజన్ కుమార్, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, నంద కిశోర్, బాబురావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 50 (3 కేజీలు), పచ్చిమిర్చి 65, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 30, క్యాప్సికం 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20.

రోడ్డుపైనే మురుగు పరుగు..


పారుతున్న మురుగు నీరు

మియాపూర్: మియాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కనున్న రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుంది. దీంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు పాఠశాల ఎదుట దుర్వాసనతో ఉండలేక ఇతర చోట్లకు వెళ్లారు.